## మియాపూర్ ఆర్టీసీ డిపో -1లో డ్రైవర్స్ డే



ఉత్తమ డ్రైవర్లకు బహుమతులను అందజేస్తున్న రంగారెడ్డి జిల్లా ఆర్ఎం శ్రీధర్

**మియాపూర్ :** మియాపూర్ ఆర్టీసీ డిపో -1లో బుధవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఆర్ఎం శ్రీధర్ హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....డ్రైవర్లు పనితీరును మెరుగుపర్చుకుని మియాపూర్ డిపోకు పేరు తీసుకురావాలని సూచించారు. డీజిల్ ఆదా చేసిన ఏడుమంది డ్రైవర్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామయ్య, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఆల్విన్‌కాలనీ:** సీవరేజ్ లైన్లు, సీసీ, బీటీ రోడ్లు,పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు కోరారు. ఈ మేరకు బుధవారం హెచ్‌యండబ్ల్యూయస్‌యస్‌బి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, జీహెచ్‌యంసీ ఏఈ ఆశలతో కార్పొరేటర్ సమావేశమయ్యారు.

# అటు వేశారు.. ఇటు మరిచారు..

- అసంపూర్తి రోడ్డుతో అవస్థలు
- శిల్పాపార్క్ మహర్షి విద్యామందిర్ రోడ్డు దుస్థితి



రెండు వాహనాలు వస్తే పాదచారులు నడవలేని పరిస్థితి

**గచ్చిబౌలి:** సగం రోడ్డు వేసి వదిలేయడం ఆ ప్రాంతవాసులకు శాపంగా మారింది. నిత్యం ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాలిలా.. చందానగర్ సర్కిల్-21 పరిధిలోని శిల్పాపార్క్‌లో మహర్షి విద్యామందిర్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు భావించారు. దాదాపు 500 మీటర్ల పొడవునా సిమెంట్ రోడ్డు వేసేందుకు రూ.90 లక్షల నిధులు కేటాయించారు. రోడ్డు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. డ్రైనేజీ లైన్ వేసి మ్యాన్‌హోళ్లను సైతం ఏర్పాటు చేశారు. కాగా ఆ రోడ్డులో రెండు వరుసల సిమెంట్ రోడ్డును వేయాల్సి ఉంది. కాని సెప్టెంబర్‌లో ఒక వరుస సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు.

**4 నెలలుగా నరకం..**

సగం వేసిన సిమెంట్ రోడ్డుతో నాలుగు నెలలుగా శిల్పాపార్క్‌వాసులు నరకం అనుభవిస్తున్నారు. కాగా ఈ రోడ్డు చివర మహర్షి విద్యామందిర్ ఉంది. నిత్యం పాఠశాలకు ఉదయం, సాయంత్రం వేళలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక రోడ్డుకు ఇరువైపులా ఉన్న అపార్ట్‌మెంట్ల నుంచి వాహనాలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. రెండు వాహనాలు ఎదురుపడితే ముందుకు వెళ్లేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు సగం వేసి వదిలేయంతో మిగిలిన రోడ్డులో ఉన్న మ్యాన్‌హోళ్లు నిత్యం పొంగిపొర్లుతున్నాయి. దీంతో మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. సిమెంట్ రోడ్డులో వాహనాలు వెళుతుండగా మిగిలిన రోడ్డులో పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. 4 నెలలు గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ స్పందించడం లేదని శిల్పాపార్క్ వాసులు తెలిపారు.

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**

నెలలు గడుస్తున్నా పనులు చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని శిల్పాపార్క్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. నవంబర్‌లో పూర్తి చేయాల్సిన పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదని, సగం వేసిన రోడ్డును పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, చందానగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని చందానగర్ సర్కిల్ ఈఈ శ్రీకాంతి తెలిపారు.

**రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే**

శిల్పాపార్క్‌లో మహర్షి విద్యామందిర్ వెళ్లే రోడ్డు పూర్తి చేసేలా చూస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. రోడ్డును సగం వేసి వదిలేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కాంట్రాక్టర్ కారణంగానే రోడ్డు పనులు ఆగిపోయాయని, ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చించానని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.



శిల్పాపార్క్‌లో ఓవైపు సిమెంట్ రోడ్డు, మిగతా రోడ్డులో మురుగు



మహర్షి విద్యామందిర్‌కు వెళ్లే రోడ్డు

## న్యూ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

**మియాపూర్:** సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో కాలనీవాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు.

## సంగీతోత్సవాలు .. వీణ కచేరీ



**మాదాపూర్:** శిల్పారామంలో నిర్వహిస్తున్న 9వ హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలను బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, సంకీర్తన చూడామణి జే.ఎస్ ఈశ్వర ప్రసాద్ భాగవతార్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటి జనరల్ మేనేజర్ సారథి ప్రారంభించారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలలో సాయంత్రం కచేరీలు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. చివరిరోజు ఉంచవృత్తి, నగర సంకీర్తనం, ఉత్సవమూర్తి ఊరేగింపు, జంటనగరాల సంగీత విద్వాంసులతో పంచరత్న గోష్టి గానం నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్వాన్ దుడ్డు సీతారామయ్య వీణా వాదన కచేరితో సందర్శకులను ఆకట్టుకున్నారు. వయోలిన్ విద్వాన్ వాసుశాస్త్రీ, మృదంగం విద్వాన్ రామకృష్ణ, ఘటంపై విద్వాన్ ఫణిభూషన్ వాద్య సహకారాన్ని అందించారు.

## పట్టుబడ్డ వాహనాల బహిరంగ వేలం

- వాహన యజమానులు అభ్యంతరం ఉంటే పత్రాలు చూపించి తీసుకోవాలి

**రాయదుర్గం:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన వివిధ రకాల వాహనాలను బహిరంగ వేలం వేయనున్నారు. సైబరాబాద్ (మెట్రో పొలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్-2004 ఆర్/డబ్ల్యూ సెక్షన్ యూ/ఎస్ 6(2),7 ప్రకారం బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. ఈ వాహనాలకు సంబంధించి యజమానులు ఆసక్తి, అభ్యంతరం ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరునెలల వ్యవధిలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో దరఖాస్తు చేసి తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. లేని పక్షంలో వదిలివేయబడి/ క్లెయిమ్ చేయని వాహనాలను వేలం నిర్వహిస్తారు. వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయి. వీటి కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ వీరలింగం ఫోన్ నెంబర్ 9490617317లో సంప్రదించాలి. మరిన్ని వివరాలకు సైబరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.in లో చూడొచ్చు.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా..



రాజేందర్‌రెడ్డి నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

**ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ**

**హఫీజ్‌పేట్ :** చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్ కాలనీలో తలెత్తిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాజేంద్రరెడ్డినగర్‌లో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగునీటిని నాలాలోకి లింక్ కల్పకుండా సరైన ఔట్‌లెట్ లేకుండా కాలనీ వీధులలోకి వదలడం తగదన్నారు. వెంటనే నాలాలోకి కలిపే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, జలమండలి అధికారులు మేనేజర్ సుబ్రహ్మణ్యం, బీఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్ రాజు, బుచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నాగరాజు, నరేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

**కృష్ణదేవరాయ నగర్ కాలనీలో..**

చందానగర్ డివిజన్ పరిధిలోని కృష్ణదేవరాయనగర్ కాలనీలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కృష్ణదేవ రాయ కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ సంతోష్ రెడ్డి, జలమండలి అధికారులు మేనేజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలపై అవగాహన

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి త్రివేణి స్కూల్ విద్యార్థులకు రహదారి నియమాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ రహదారి నియమాలను పాటిస్తూ, వాటిని కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్ళు నిండిన తరువాతే డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం ఉంటుందని, 50 సీసీ లోపు ఉన్న వాహనాలను నడిపేందుకు తల్లిదండ్రుల నుంచి ధృవీకరణ ఉండాలన్నారు. కార్యక్రమంలో త్రివేణి స్కూల్ సీఆర్‌ఓ సాయి నర్సింహారావు, ఏసీఆర్‌ఓ నరేష్, ప్రిన్సిపాల్ అనితారావు పాల్గొన్నారు.

## అరుదైన శస్త్ర చికిత్స

**శేరిలింగంపల్లి:** సిటిజన్స్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స చేశారు.ఎడమ భుజంలో నిరంతర నొప్పి, వాపుతో బాధపడుతున్న 62 ఏళ్ళ మహిళకు ట్రాన్స్‌ఫార్మేటివ్ రివర్స్ షోల్డర్ ఆర్థోప్లాస్టీ విధానంతో చికిత్స చేశారు. భారతదేశంలో ఎక్కువగా కనిపిస్తోన్న ఆస్టియో ఆర్థరైటిస్ సమస్యతో రోగి ఎడమ భుజంలో నొప్పితో బాధపడుతున్నారని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వాసుదేవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 9 శాతం మంది పురుషులు, 18 శాతం మంది మహిళలు ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌సీఓఓ డాక్టర్ పి ప్రభాకర్, డాక్టర్లు పాల్గొన్నారు.

## అపర్ణ కౌంటీలో ఎమ్మెల్యే పర్యటన



సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

**హఫీజ్‌పేట్ :** మాదాపూర్ డివిజన్ పరిధిలోని అపర్ణ కౌంటీలో నెలకొన్న సమస్యలపై బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపర్ణ కౌంటీలో ఔట్‌లెట్ సమస్యపై కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు పర్యటించామన్నారు. ఔట్‌లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. మురుగు నీరు ఔట్‌లెట్ ద్వారా కాయిదమ్మకుంట చెరువులోకి చేరుతుండడంతో చెరువు మురుగుమయంగా మారిందన్నారు. చెరువులో కలవకుండా యూజీడీ పైప్‌లైన్‌లోకి మళ్ళించాలని చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలో కాయిదమ్మకుంట చెరువును సుందరీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, ఆర్ఐ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, గౌతమ్‌గౌడ్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే



దర్గాలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్

**పటాన్‌చెరు:** పట్టణ పరిధిలోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, ముస్లిం మత పెద్దలు లియాఖత్ అలీ,వాజిద్ అలీ, హమీద్, అజ్మత్, ఇమ్రాన్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రెండుచోట్ల ఓట్లు తొలగించాలని వినతి

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి



**పటాన్‌చెరు టౌన్:** ఓటర్ జాబితాలో అక్రమాలను గుర్తించి తొలగించాలని ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి కోరారు.బుధవారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దేవుజాకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం, పాశమైలారం, ఇస్నాపూర్, రామచంద్రాపురం, పారిశ్రామికవాడలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు, రెండుచోట్ల ఓటుహక్కు కలిగి ఉన్నారని, అలాంటి వారిని తొలగించాలని కోరారు. ప్రస్తుతం బూత్‌లెవెల్ ఆఫీసర్‌ల ద్వారా రెండుచోట్ల ఓట్లు కలిగి ఉన్న వారిని తక్షణమే గుర్తించి తొలగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గచ్చిబౌలి:** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి కూడలి ప్రాంతంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి కూడలి వద్ద వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఉస్మానియా మార్చురీకి పంపారు. మృతుడి వయస్సు( 35-40) ఉంటుందని, ఎవరైన గుర్తు పడితే రాంభూపాల్ రెడ్డి ఏఎస్ఐ ఫోన్ నంబర్ 8712567022, పోలీస్‌స్టేషన్ నంబర్ 8331013199లో సంప్రదించాలని ఆయన కోరారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**గచ్చిబౌలి:** గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పీవీబీ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధురానగర్, టింబర్ లేక్‌కాలనీ, ప్రశాంత్ హిల్స్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, ఓరియన్ విల్లాస్, బయోడైవర్శిటీ పార్కు, టీవీఎస్ షోరూమ్, సెక్రటేరియట్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- కొమరమ్‌భీమ్, కాళోజీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్-1, ఫేజ్-2 ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ పీవీబీ వేణుగోపాల్ తెలిపారు.

**నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో..**

నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- గోపన్‌పల్లి 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండాలో..
- డైమండ్ హిల్స్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైమండ్‌హిల్స్, గోపన్‌పల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

- కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజరాజేశ్వరినగర్ ప్రాంతంలో విద్యుత్ ఉండదన్నారు.
- జేవీజీహిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెంట్రల్ పార్కు ఫేజ్-2, కేఎంఆర్ ఎస్టేట్స్, గాయత్రి లేఅవుట్, మాధవహిల్స్, కాంతివనం

**చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

**హఫీజ్‌పేట్ :** చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీ ఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ వెనకాల, హనీఫ్ కాలనీ
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్‌ఐజీ, మంజీరా పైప్‌లైన్ రోడ్డు ప్రాంతాలలో..

**వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..**

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో.. 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సురక్ష ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, సత్య ఎన్‌క్లేవ్, ఉషోదయ కాలనీ, రాజేందర్‌రెడ్డినగర్, అపర్ణహిల్ పార్కు తదితర ప్రాంతాలలో ..
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దీప్తిశ్రీనగర్, శాంతినగర్, సువెల్ల ప్రాజెక్టు, టెక్నోపొలిస్, ధర్మపురి టెంపుల్, రోడ్డు నంబర్లు 12,13,14 ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

**హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో....**

- హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.
- ఆదిత్యనగర్, హఫీజ్‌పేట్, సాయిరాం కాలనీ, మైత్రీనగర్ ఫీడర్ల పరిధిలో.. ఆదిత్యనగర్, శ్రీకృష్ణనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్‌కాలనీ, భాను టౌన్‌షిప్, ప్రజయ్ సిటి, అపర్ణా కాలనీ, దేవి హోమ్స్, ఆల్‌ఇండియా కాలనీ మెయిన్‌రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్ ఫేజ్ 1,2,3,4,12, జనప్రియనగర్, ఈకామ్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**శేరిలింగంపల్లిలో..**

**శేరిలింగంపల్లి:** లింగంపల్లి వెజ్ మార్కెట్, రైల్ విహార్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.

- 11 కేవీ లింగంపల్లి వెజ్ మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, వెజిటబుల్ మార్కెట్, ఎస్ఎం లేఅవుట్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- 11 కేవీ రైల్ విహార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సాయిబాబ టెంపుల్ ఏరియా, సిటిజన్ కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్ పంపు బ్యాక్ సైడ్‌ఏరియా, గిడ్డంగి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

**మియాపూర్‌లో..**

**మియాపూర్ :** సెవెన్‌హిల్స్, బృందావన్ కాలనీ, నందమూరి నగర్, శ్రీలా గార్డెన్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్, భవ్యాస్ నందనవనం, వెర్టెక్స్ సద్గురు, బృందావన్ కాలనీ, నందమూరి నగర్, హైదర్‌నగర్ మెయిన్ రోడ్డు, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీలా గార్డెన్, ఎస్‌సీబీ నగర్, నడిగడ్డతండా ,సత్యనారాయణ ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

**మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో..**

- ప్రగతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. గురువారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏరియా, జేపీఎన్‌సర్ మెయిన్ రోడ్డు,మహాదేవ్ అపార్ట్‌మెంట్ ,డీకే ఎన్‌క్లేవ్, మణిసాయి అపార్ట్‌మెంట్, మీరా హాస్పిటల్, అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మియాపూర్ మెయిన్‌రోడ్డు, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్, ఈ సేవా ప్రాంతం, మియాపూర్ విలేజ్, నీలిమా గ్రీన్స్, రాధామాధవ్ అపార్ట్‌మెంట్, బాలాజీనగర్, శ్రీరంగపురం కాలనీ,అరబిందో కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, లోటస్ కాలనీ, జేపీనగర్, నాగార్జున ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

# పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ కమిషనర్ సుధాకరరావు

**హఫీజ్‌పేట్ :** పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ డి.సుధాకరరావు అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ శ్రమదాన కార్యక్రమంను భారత ప్రభుత్వం ఆదాయపు పన్ను విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ డి.సుధాకరరావు, కమిషనర్ ఏజీవి ప్రసాద్, అడిషనల్ కమిషనర్లు ఎస్‌పిజి మొదలియార్, రీమా యాదవ్, హర్షిత్ చౌహాన్, అధికారి సీహెచ్.వి. పైడేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆదాయపు పన్ను విభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



వెంకటయ్య

**మియాపూర్ :** పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య(50) భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులు, కూతురుతో కలిసి మియాపూర్‌లో నివాసముంటున్నారు. వెంకటయ్య స్థానికంగా మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 20 వెంకటయ్య ఉదయం ఇంట్లో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన కుమారుడు దశరథ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం

**పటాన్‌చెరు టౌన్:** తల్లి ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సునీల్ కుమార్ ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 18వ తేదీన సునీల్ భార్య మంజుల వాణి ఇద్దరు పిల్లలు వేద్విక్ సాయి(6), పరిమిత(8) లను తీసుకొని సంగారెడ్డిలో ఉండే సోదరుని వద్దకు వెళ్తానని చెప్పడంతో భర్త సునీల్ పటాన్‌చెరు బస్టాండ్‌లో వదిలి వెళ్ళాడు. కొద్దిసేపటికి భర్త సునీల్ భార్య మంజులవాణికి ఫోన్ చేయగా సోదరుని ఇంటికి చేరుకున్నానని చెప్పింది. తిరిగి సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన సునీల్ బామ్మర్ది గణేష్‌కు ఫోన్ చేసి అడగగా రాలేదని తెలిపాడు. దీంతో భార్య ,ఇద్దరు పిల్లల కోసం సునీల్‌కుమార్ స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. భార్య పిల్లల అదృశ్యంపై మంగళవారం రాత్రి సునీల్ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.